- అభివృద్ధికి చిరునామా కొత్తగూడెం నియోజకవర్గం
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త శోభను సంతరించుకున్న రహదారులు
- రూ.56.50 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం
- 350 పడకల ఆస్పత్రిగా జిల్లా ప్రభుత్వాసుపత్రి అప్‌గ్రేడ్
- జిల్లాకేంద్రంలో అందుబాటులోకి వైద్య, నర్సింగ్ కళాశాలు
- నియోజకవర్గంలో రూ.3 వేల కోట్ల అభివృద్ధి పనులు

# ప్రగతి పథంలో రాములోరి ఇలాకా




భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : చీకటైతే వీధి లైట్లు వెలగవు. సెంట్రల్ లైటింగ్ ఉన్నా మిణుకు మిణుకులే. తాగునీటికి రోజూ తండ్లాటే. నీళ్ల కోసం గల్లీల్లో మహిళల పాట్లు. చెత్తా చెదారంతో నిండిపోయే వార్డులు. మురుగు కంపు కొట్టే కాలువలు. వానొచ్చిందంటే జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్, గొల్లగూడెం వార్డులు నీటిలో మునగాల్సిందే. పెట్టేబేడా సర్దుకొని రాత్రుళ్లు ఇళ్లు ఖాళీ చేసిన సందర్భాలు కోకొల్లలు. ఇక రామవరం ఎస్సీబీ నగర్ పరిస్థితి మరింత దారుణం. మోస్తరు వర్షానికే వందల ఇళ్లు నీట మునిగే పరిస్థితి. కొత్తగూడెం అండర్ బ్రిడ్జి కింద నీళ్లు నిలిచి గంటలకొద్దీ రవాణా సౌకర్యానికి అంతరాయం. ప్రజలు ఛీదరించుకున్నా అటు అధికారులు, ఇటు పాలకులు మొఖం చాటేసుకుని వెళ్లే పరిస్థితి. ఇలాంటి సమస్యలన్నీ చాంతాడంత. ఉమ్మడి పాలకుల హయాంలో ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నాయకులు మారడంతోపాటు ప్రజల తలరాతలు మారాయి.

## పాత రోజులకు చరమగీతం..

## అభివృద్ధే కొలమానం..

ముఖ్యమంత్రి కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాల అజెండాతో ప్రజల ముందుకొచ్చి పాత రోజులకు చరమగీతం పలికారు. అభివృద్ధే కొలమానంగా పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువులను అభివృద్ధి చేసి జలకళ సంతరించుకునేలా చేశారు. భూగర్భ జలాలు పెరిగి వానకాలంతోపాటు వేసవిలోనూ చెరువులు నిండుకుండలా కనిపించే రోజులొచ్చాయి. నెర్రెలు బారిన నేలలు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. మట్టిదారులన్నీ సీసీ రోడ్లుగా మార్చి, పూడుకుపోయిన మురికి కాలువలకు చక్కటి రూపం తీసుకొచ్చారు. వానొస్తే కొత్తగూడెం పట్టణంలో చుక్కనీరు రోడ్లపై నిలవకుండా చేశారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు హైదరాబాద్ తరహాలో సెంట్రల్ లైటింగ్, పచ్చందాలతో దారులన్నీ మురిసిపోతున్నాయి. డివైడర్ల మధ్యలో మొక్కలు కొత్త అందాలు తెచ్చిపెట్టాయి. ఇక వంద పడకల ఆస్పత్రి కాస్త 350 పడకల ఆస్పత్రిగా మారడంతోపాటు మాతా, శిశు కేంద్రంగా వంద పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చారు. దీంతోపాటు మెడికల్, నర్సింగ్ కాలేజీలు కూడా అందుబాటులోకి వచ్చాయి. రాములోరి ఇలాకా ప్రగతి పథంలో పయనించడానికి కారణం సీఎం కేసీఆర్ పాలనే అని చెప్పొచ్చు.

## అప్పుడు డివిజన్ కేంద్రం.. ఇప్పుడు జిల్లా కేంద్రం

డివిజన్ కేంద్రంగా ఉన్న కొత్తగూడెం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు.. కొత్త జిల్లాల ఆవిర్భావంతో జిల్లా కేంద్రంగా అవతరించింది. 2017లో కొత్త జిల్లాగా ఏర్పాటు కాగా.. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు ప్రస్తుతం కొత్త భవనాలు వచ్చేశాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణంతో 56 శాఖల అధికారులు ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు ఒకే దగ్గర ఉండాలని, ప్రజలకు సుపరిపాలన అందాలనే ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను రూ.56.50 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీంతో మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చింది. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్, డీఆర్వోలకు క్వార్టర్లు కూడా అక్కడే నిర్మించారు.



## మెడికల్ కాలేజీతో చేరువైన సర్కారు వైద్యం

కేంద్ర ప్రభుత్వం కాదన్నా సీఎం కేసీఆర్ కొత్తగూడెంకు మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. దీంతో ఏజెన్సీకి మెరుగైన వైద్య సేవలు అందించడంలో సఫలమయ్యారనే చెప్పాలి. రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసి పాల్వంచ కేఎస్ఎం వద్ద మెడికల్ కళాశాలను ప్రారంభించారు. 150 మంది వైద్య విద్యార్థులు ఇక్కడ సీట్లు పొందే అవకాశం దొరికింది. దీంతోపాటు వంద పడకల మాతా, శిశు కేంద్రం, జిల్లా జనరల్ ఆస్పత్రి అందుబాటులోకి రావడంతో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు చేరువయ్యాయి. ప్రజలకు ఖరీదైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. మాతా, శిశు మరణాలు జరగకుండా ఎంసీహెచ్ ఆస్పత్రిలో టిఫా స్కానింగ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ను ఇటీవల కాబోయే తల్లులకు అందజేశారు. రూ.4 కోట్ల వ్యయంతో రేడియాలజీ హబ్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. సీటీ స్కాన్, మమోగ్రామ్, ఎక్స్‌రే, టుడీ ఎకో పరికరాలను కూడా అందుబాటులో ఉంచారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. వంద మంది పేషెంట్ల వరకు ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నారు.

### రైతుబంధు, రైతుబీమా ద్వారా రైతులకు అందజేసిన మొత్తం..

| రైతుబంధు పంపిణీ | రైతుబీమా పరిహారం |
|---|---|
| 2018లో రూ.33 కోట్లు | 50 మందికి రూ.2.50 కోట్లు |
| 2019లో రూ.25 కోట్లు | 55 మందికి రూ.2.75 కోట్లు |
| 2020లో రూ.41 కోట్లు | 87 మందికి రూ.4.35 కోట్లు |
| 2021లో రూ.40 కోట్లు | 73 మందికి రూ.3.65 కోట్లు |
| 2022లో రూ.40 కోట్లు | 25 మందికి రూ.1.25 లక్షలు |
| 2023లో రూ.179 కోట్లు | 290 మందికి రూ.14.5 కోట్లు |

### ఆసరా పింఛన్లు

- చుంచుపల్లి మండలవ్యాప్తంగా 3,991 మందికి నెలకు రూ.88 లక్షలు
- సుజాతనగర్‌లో 3,523 మందికి నెలకు రూ.76.49 లక్షలు
- కొత్తగూడెంలో 8,662 మందికి నెలకు రూ.190 లక్షలు
- లక్ష్మీదేవిపల్లిలో 4,251 మందికి నెలకు రూ.93.70 లక్షలు
- పాల్వంచలో 3,956 మందికి నెలకు రూ.87.73 లక్షలు

### ఇతర అభివృద్ధి నిధులు..



- రేగళ్ల మైలారం రహదారి నిర్మాణానికి రూ.70 కోట్లు
- చింతల చెరువు అభివృద్ధికి రూ.10 కోట్లు
- ముర్రేడు వాగు వరద నివారణ పరిష్కారానికి రూ.34 కోట్లు
- కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.215 కోట్లు
- పంచాయతీరాజ్ పరిధిలో 320 పనులకు రూ.400 కోట్లు
- మిషన్ భగీరథ ద్వారా 230 గ్రామాలకు రూ.70.06 కోట్లు (38,189 నల్లా కనెక్షన్లు)
- దళితబంధు ద్వారా 100 మందికి రూ.10 కోట్ల విలువైన యూనిట్లు
- నియోజకవర్గ అభివృద్ధి (సీడీసీ) నిధులతో 66 పనులకు రూ.3 కోట్లు
- డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.135 కోట్ల అభివృద్ధి పనులు

## పచ్చందాలతో కొత్తకళ



పల్లె ప్రగతి ద్వారా రహదారుల రూపురేఖలు మారిపోయాయి. పచ్చందాలతో రహదారులు కొత్త శోభను సంతరించుకున్నాయి. నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండలం నుంచి చుంచుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మండలం జగన్నాథపురం వరకు రహదారులు పచ్చదనాన్ని పులుముకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు డివైడర్లను ఏర్పాటు చేసి మధ్యలో పూల మొక్కలను నాటారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో రెండు పట్టణాలకు కొత్త శోభ వచ్చింది. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రెండు పట్టణాలను హైదరాబాద్, సికింద్రాబాద్ తరహాలో అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. కిన్నెరసాని తాగునీటి పథకానికి రూ.44 కోట్లు మున్సిపల్ డెవలప్‌మెంట్ నిధులతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.13 కోట్లతో వార్డుల్లో సీసీ రోడ్లతోపాటు రాజీవ్ పార్క్ అభివృద్ధి, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వనమా అభ్యర్థన మేరకు ఇటీవల సీఎం కేసీఆర్ కొత్తగూడెంలో నిర్వహించిన సభలో మున్సిపాలిటీకి రూ.115 కోట్లు మంజూరు చేశారు. ఎన్నో ఏళ్లుగా వరద వచ్చినప్పుడల్లా ఇబ్బంది పడుతున్న ముర్రేడు వాగు బాధితులకు శాశ్వత పరిష్కారం చూపించారు. ఏకంగా రూ.34 కోట్ల నిధులను మంజూరు చేసి ముర్రేడు వాగు పరీవాహక ప్రాంతవాసులకు వరదతో ఇబ్బంది లేకుండా చేయగలుగుతున్నారు. ఏకంగా కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.3000 కోట్ల నిధులను మంజూరు చేసి రోడ్లు, సీసీ డ్రెయిన్‌లు, తాగునీటి సౌకర్యానికి పరిష్కారం చూపుతున్నారు.

# 'ఖమ్మం మెట్టు'.. అభివృద్ధి అదిరేట్టు..

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రగతి, సంక్షేమంలో దూసుకెళ్తున్న జిల్లా
- గ్రామాలు, పట్టణాభివృద్ధికి భారీగా నిధులు
- 4.75 లక్షల ఇళ్లకు మిషన్ భగీరథ నీరు
- 'భక్త రామదాసు'తో 60 వేల ఎకరాలు సస్యశ్యామలం
- శరవేగంగా సీతారామ ఎత్తిపోతల పనులు
- ఐటీ హబ్‌తో వందలాది మంది యువతకు ఉపాధి
- హైదరాబాద్‌కు దీటుగా ఖమ్మం నగరాభివృద్ధి






ఖమ్మం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో ఖమ్మం జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతున్నది. అన్నిరంగాల్లో ముందంజలో నిలుస్తున్నది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అధికారులు, సద్వినియోగం చేసుకుని గ్రామాలు, పట్టణాలను ప్రగతి బాట పట్టిస్తున్నారు. అంతేకాదు సీఎం కేసీఆర్ జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి 589 పంచాయతీల అభివృద్ధికి ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు, మేజర్ పంచాయతీలు పెద్దతండా, ఏదులాపురం, నేలకొండపల్లి, తల్లాడ, కల్లూరు పంచాయతీల్లో ఒక్కో పంచాయతీకి రూ.10 కోట్లు, నగరపాలక సంస్థ రూ.30 కోట్లు, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఒక్కో పంచాయతీకి రూ.30 కోట్ల చొప్పున నిధులు ప్రకటించారు. అలాగే జిల్లా కేంద్రం పరిధిలో అర్హత ఉన్న ప్రతి జర్నలిస్ట్‌కు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం పనులు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. ఖమ్మం మున్నేరుపై తీగల వంతెన, నదికి రెండు వైపులా ఆర్సీసీ వాల్స్ నిర్మాణానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు.

## సాగుకు ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. సాగుపై ప్రత్యేకంగా వ్యవసాయ క్యాలెండర్‌ను రూపొందించింది. జిల్లా వ్యవసాయశాఖ పకడ్బందీగా క్యాలెండర్‌ను అమలు చేస్తున్నది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలే రైతులు సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నది. వానకాలంలో వరిలో సన్నరకం సాగు చేయాలని, పత్తి పంటతో పాటు అపరాలు సాగు చేయాలని సూచిస్తున్నది. భౌగోళిక, సాగునీటి వనరుల అంశాలను పరిగణనలోకి తీసుకుని నేలల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయిస్తున్నది. రైతులు పండించిన పంటకు సర్కార్ గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నది.

## చకచకా 'సీతారామ' పనులు



గోదావరిపై ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మించి కాలువల ద్వారా నదీ జలాలను ఉమ్మడి జిల్లాకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిష్ఠాత్మకంగా సీతారామ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించింది. ఇది అతిపెద్ద ఎత్తిపోతల పథకం. ప్రాజెక్ట్ పూర్తయితే ఉభయ జిల్లాల పరిధిలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిర్దేశించిన గడువులోపు పనులు పూరి చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల ఇల్లెందులో జరిగిన ఎన్నికల ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రస్తావించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తున్నామన్నారు.

## 'భక్త రామదాసు'తో సస్యశ్యామలం..

రాష్ట్ర ప్రభుత్వం తిరుమలాయపాలెం మండలంలో రూ.335.59 కోట్లతో భక్త రామదాసు ఎత్తిపోతల పనులను చేపట్టింది. పనులు ప్రారంభించిన కేవలం 11 నెలల సమయంలోనే ప్రాజెక్ట్ పూర్తయింది. భూసేకరణకు రూ.16 కోట్లు, మోటర్లు, పంపులకు రూ.32.44 కోట్లు, పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.163.73 కోట్లతో ఇతర నిధులతో విద్యుత్ సబ్‌స్టేషన్, సివిల్, హైడ్రో మెకానికల్ పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు పరిధిలో 60 వేల ఎకరాలు సస్యశ్యామలమవుతున్నాయి. తిరుమలాయపాలెం మండల పరిధిలో 17,286 ఎకరాలు, కూసుమంచి మండలం 23,448 ఎకరాలు, నేలకొండపల్లి మండలం 2,958 ఎకరాలు, ఖమ్మం రూరల్ మండలం 12,605 ఎకరాలు, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండల పరిధిలో 2,440 ఎకరాలకు ఇప్పుడు పుష్కలంగా సాగునీరు అందుతున్నది. అంతేకాదు పొరుగు జిల్లా అయిన మహబూబాబాద్ జిల్లాలోని 1,120 ఎకరాలకూ నీరు అందుతున్నది.

## పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు..

జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వచ్చాక శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ ఖమ్మం నగరంలో పోలీస్ కమిషనరేట్ నిర్మించాలని నిర్ణయించింది. ఇప్పుడు నగరంలోని పాత పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో అన్ని వసతులతో కమిషనరేట్ కార్యాలయం అందుబాటులోకి వచ్చింది. అంతేకాదు సత్తుపల్లి, ఖమ్మం, ఖమ్మం రూరల్, వైరా పోలీస్ సబ్‌డివిజన్లలో ఏసీపీల కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి.

## రూ.50 కోట్లతో ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలు..

ఒకప్పుడు ఎమ్మెల్యేలకు ఏదైనా సమస్య చెప్పుకోవాలంటే ప్రజలు ఆయన స్వగృహానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. గంటలకొద్దీ పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేది. ఈ సమస్యలకు చెక్‌పెట్టేందుకు రాష్ట్ర సర్కార్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల పరిధిలో ఒక్కో కార్యాలయానికి రూ.10 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసింది. దీనిలో భాగంగా రూ.50 కోట్ల వ్యయంతో ఖమ్మం నగరంతో పాటు మిగతా నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి.



## 'పల్లె ప్రగతి'లో ముందంజ..

పల్లె, పట్టణ ప్రగతి అమలులో జిల్లా ముందంజలో ఉన్నది. ఖమ్మం నగరపాలక సంస్థతో పాటు మూడు మున్సిపాలిటీలు, 589 గ్రామ పంచాయతీల్లో పథకం విజయవంతమైంది. ప్రతి పట్టణం, గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం అందుబాటులోకి వచ్చింది. పారిశుధ్య పనులు, చెత్తను తరలించేందుకు ట్రాక్టర్, హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు నీరు పెట్టేందుకు ట్యాంకర్ సమకూర్చాయి. వాలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వచ్చాయి. నిరుపయోగంగా ఉన్న బావులు, శిథిలమైన బావులు నేలమట్టమయ్యాయి.

## 4.75 లక్షల కుటుంబాలకు నల్లా నీరు..



జిల్లాలోని ప్రతి ఇంటికీ శుద్ధ జలం అందించేందుకు అధికారులు సరఫరా విభాగాలను పాలేరు, వైరా, గోదావరి సెగ్మెంట్‌లుగా విభజించారు. నీటి సరఫరాకు గతంలో అందుబాటులో ఉన్న 1,605 ట్యాంక్‌లే కాక కొత్తగా 519 ట్యాంక్‌ల నిర్మాణాలను పూర్తి చేశారు. పాలేరు, వైరా సెగ్మెంట్‌ల పరిధిలో నూరుశాతం పైపులైను పనులు పూర్తయ్యాయి. 21 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మూడు సెగ్మెంట్ల పరిధిలో రూ.3,389 కోట్లతో పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 4.75 లక్షల కుటుంబాలకు ప్రతిరోజూ శుద్ధజలం అందుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రోజుకు 135 లీటర్లు, మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో ఇంటికి రూ.150 లీటర్ల చొప్పున తాగునీరు అందుతున్నది. పాలేరు రిజర్వాయర్ నుంచి ఆరు మండలాలతో పాటు ఖమ్మం కార్పొరేషన్, వైరా రిజర్వాయర్ నుంచి 11 మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీ, గోదావరి సెగ్మెంట్ నుంచి మూడు మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీకి నీరు సరఫరా అవుతున్నది.

## అన్ని విధాలుగా నగరాభివృద్ధి..

రూ.4 కోట్లతో నగరంలోని లకారం చెరువు సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. రూ.100 కోట్ల నిధులతో గోళ్లపాడు చానల్ పనులు పూర్తయ్యాయి. చానల్‌పై సుందర వనాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.70 కోట్లతో ధంసలాపురం ఆర్వోబీ అందుబాటులోకి వచ్చింది. ముస్తాఫానగర్ నుంచి ధంసలాపురం గేటు వరకు నాలుగులేన్ల రహదారి పనులు పూర్తయ్యాయి. నగరంలోని టేకులపల్లిలో 1,210 కుటుంబాలకు అధికారులు డబుల్ బెడ్ రూం ఇండ్లు అప్పగించారు.



## ఇంటింటికీ 'మిషన్ భగీరథ'..

40 ఏండ్లుగా మున్సిపల్ పీఠంపై కూర్చున్న పాలకులు ప్రజల మంచినీటి కష్టాలు తీర్చలేకపోయారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.230 కోట్ల నిధులతో మిషన్ భగీరథ పనులు పూర్తి చేయించింది. నగర పరిధిలోని ఒక్కో ఇంటికీ రోజుకు 150 లీటర్ల చొప్పున వచ్చే 30 ఏండ్ల పాటు సరఫరా చేసే విధంగా పైప్‌లైన్ల నిర్మాణం పూర్తయింది. గత పాలకులు రూ.74 కోట్ల నిధులతో చేపట్టిన మంచినీటి ప్రాజెక్ట్ సైతం ఇటీవల పూర్తయింది. ప్రస్తుతం నగర పరిధిలోని 84 వేల గృహాలకు శుద్ధజలం అందుతున్నది.



## రూ.2 వేల కోట్లతో అభివృద్ధి..



సుమారు రూ.2 వేల కోట్ల పైచిలుకు నిధులతో ఖమ్మం నగరం హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి సాధించింది. దీంతో పాటు నగరపాలక సంస్థకు ఏటా విడుదలవుతున్న రూ.100 కోట్ల నిధులతో పాలకవర్గం నగరంలో అంతర్గత రహదారులు, నీటి సరఫరా, డ్రైన్లు, సైడ్ కాలువల నిర్మాణాలు చేపడుతున్నది. రూ.50 కోట్లతో నగరంలో పలుచోట్ల ఏసీ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాలు పూర్తి చేయించింది.

## రూ.23 కోట్లతో కార్పొరేషన్ కార్యాలయం..




ఖమ్మం మున్సిపాలిటీ నగరపాలక సంస్థగా రూపాంతరం చెందింది. పెరుగుతున్న జనాభా, వారి అవసరాలకు అనుగుణంగా పాత మున్సిపల్ కార్యాలయంలో సౌకర్యాలు లేవు. మున్సిపల్ అధికారులు సౌకర్యవంతమైన వాతావరణంలో పనిచేసే వెసులుబాటు లేదు. ప్రజలకు పార్కింగ్ సౌకర్యమూ ఉండేది కాదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన నగరపాలక సంస్థ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణానికి ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేసింది. మంత్రి అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని కార్యాలయ నిర్మాణం పూర్తి చేయించారు. ప్రస్తుతం అన్ని వసతులతో కార్యాలయం అందుబాటులోకి వచ్చింది.

## జిల్లాకే తలమానికం ఐటీ హబ్..

ఐటీ రంగాన్ని జిల్లాకేంద్రాలకూ విస్తరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఐటీ హబ్‌లు నిర్మిస్తున్నది. వీటి ద్వారా అంతర్ జిల్లా అభ్యర్థులకు ఉపాధి కల్పించాలనేది ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో రూ.25 కోట్ల వ్యయంతో ఐటీ హబ్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ఐటీ హబ్‌లో వందలాది మంది యువతీ యువకులు కొలువులు చేస్తున్నారు. త్వరలో రూ.36 కోట్ల నిధులతో రెండో దశ ఐటీ హబ్ పనులు ప్రారంభం కానున్నాయి.



## స్థానిక సంస్థల బలోపేతం..



రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు చిన్న చిన్న తండాలు, మారుమూల పల్లెలు, గ్రామాలను పంచాయతీలుగా ప్రకటించింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఎన్నో పల్లెలు ఇప్పుడు పంచాయతీలుగా మారాయి. దీంతో పాలన సులభతరం అయింది. అలాగే ప్రభుత్వ చొరవతో సత్తుపల్లి, వైరా, మధిర పట్టణాలూ మున్సిపాలిటీలయ్యాయి. అలాగే ఖమ్మం నియోజకవర్గంతో పాటు పాలేరు, సత్తుపల్లి, వైరా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని వందలాది గ్రామాలను స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి తీసుకురావడంతో అభివృద్ధి సులభతరమైంది.



## రూ. 25 కోట్లతో బస్టాండ్..

దశాబ్దాల క్రితం నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఖమ్మంలో బస్టాండ్ నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. ఆ నిధులతో బస్టాండ్ అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు పట్టణ జనాభా పెరుగుతూ వస్తున్నది. క్రమంగా వాహనాల వినియోగం పెరిగింది. ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యం అయిపోయింది. పట్టణం నగరపాలక పాలక సంస్థగా రూపాంతరం చెందిన తర్వాత సమస్య జటిలమైంది. సమస్యను తీవ్రంగా పరిగణించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నూతన బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.25 కోట్ల నిధులతో నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లో బస్టాండ్‌ను నిర్మించారు. రెండేళ్ల క్రితం మంత్రి కేటీఆర్ బస్టాండ్‌ను ప్రారంభించారు. దీంతో నగరవాసుల సమస్యలకు పరిష్కారం లభించింది.